సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 3 । మార్చి । 2024



వలంటీర్లపై ఎందుకంత కక్ష
ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులైన వలంటీర్లపై టీడీపీ, జనసేన పార్టీలకు ఎందుకు అంత కక్ష అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రశ్నించారు. -IIలో



నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి
విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని కడప ఉప విద్యా శాఖాధికారి డి. రాజగోపాల్‌రెడ్డి సూచించారు. -IIలో

గరిష్టం/కనిష్టం
37.2 /21.6

వాతావరణం
జిల్లాలో శుక్రవారం 21.6 – 37.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

వైవీయూ: జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 69 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు మొత్తం 14341 మంది విద్యార్థులకు 13,683 మంది హాజరయ్యారు. సంస్కృతం, తెలుగు, హిందీ, ఉర్దూ పరీక్షలను నిర్వహించారు. జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను ఇంటర్ బోర్డు అధికారులు తనిఖీ చేశారు.

91.37 శాతం పింఛన్ల పంపిణీ



మైదుకూరులో సుబ్బమ్మకు వృద్ధాప్య పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ అమరావతి

కడప రూరల్: జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక కింద పింఛన్ల పంపిణీ ప్రక్రియ వేగంగా సాగుతోంది. మొత్తం 2,69,191 పింఛన్లకు రూ 79,61,85,000 పంపిణీ చేయాలి. ఆ మేరకు రెండో రోజైన శనివారం సాయంత్రానికి 2,45,955 పింఛన్లకు రూ 72,75,74,500 అందజేశారు. దీంతో పింఛన్ల పంపిణీ 91.37 శాతం నమోదైంది. వలంటీర్‌ల ద్వారా ఇంటింటికీ పింఛన్ల పంపిణీ పట్ల అవ్వాతాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



రైతులతో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

పులివెందుల రూరల్: ప్రతి రైతు తమ పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్‌తో పాటు ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు అన్నారు. శనివారం పులివెందుల మండల పరిధిలోని ఎర్రబల్లి-1 రైతుభరోసా కేంద్రంలో (ఆర్‌బీకే) ఈక్రాప్, ఈకేవైసీ సోషల్ ఆడిట్ మొదటి జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్‌బీకేలో యూహెచ్‌ఏలు, యూఏఎల్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు పంటల నమోదుకు సంబంధించి డేటా సోషల్ ఆడిట్‌కు ప్రదర్శించిన జాబితాలో తమ పేర్లను చూసుకోవాలన్నారు. ఏవైనా తప్పులు ఉంటే ఆర్‌బీకే అధికారులకు తెలియజేయాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎం. వెంకటకృష్ణారెడ్డి

వైవీయూ: జిల్లాలో పదోతరగతి పరీక్షల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం ఇవ్వకుండా కట్టుదిట్టంగా నిర్వహించాలని పదోతరగతి పరీక్షల జిల్లా పరిశీలకులు, ఏపీ మోడల్‌స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ ఎం. వెంకటకృష్ణారెడ్డి ఆదేశించారు. శనివారం కడపలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 2023-24 పదోతరగతి పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్‌కు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సీఎస్, డీఓలు సమన్వయంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో వసతులు సరిగ్గా ఉన్నాయో లేదో ముందుగానే చూసుకోవాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం. అనూరాధ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు అనుసరించి మెలగాలన్నారు. అనంతరం పరీక్షల నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో కడప ఉప విద్యా శాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, కడప ఎంఈఓ పాలెం నారాయణ, డీసీఈబీ సెక్రటరీ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

చుక్కల మందుతో చక్కని జీవితం

జిల్లా వ్యాప్తంగా ఆదివారం పల్స్‌పోలియో రెండు చుక్కల మందుల పండుగ జరగనుంది. పెద్దలు తమ పిల్లల పండంటి జీవితానికి రెండు చుక్కల మందును వేయించాలి. చిన్నారుల చింతలేని ఆరోగ్యకరమైన జీవితానికి దోహదపడాలి. కాగా ఈ కార్యక్రమం విజయవంతానికి యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టింది.

- నేడు జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం
- ఐదేళ్లలోపు చిన్నారులకు చుక్కల మందు
- 3న బూత్ స్థాయిలో..4,5న ఇంటింటికీ



కడప రూరల్: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 3వ తేదీన పల్స్‌పోలియో కార్యక్రమం జరగనుంది. 4, 5వ తేదీల్లో ఇంటింటికీ వెళ్లి ముందు రోజు వేయించుకోని చిన్నారులకు వైద్య సిబ్బంది చుక్కల మందును వేస్తారు. ఆ మేరకు జిల్లా వ్యాప్తంగా అప్పుడే జన్మించిన వారితో పాటు ఐదేళ్లలోపు చిన్నారులకు చుక్కల మందును వేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకు సంబంధించి ఆ శాఖ అన్ని చర్యలు చేపట్టింది. క్షేత్ర స్థాయిలో పల్స్ పోలియో చుక్కల మందు వేసే బూత్‌లను ఏర్పాటు చేశారు. బస్టాండ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో కూడా చుక్కల మందును వేస్తారు. ప్రత్యేకంగా మొబైల్ బూత్‌లను ఏర్పాటు చేశారు. హైరిస్క్ ప్రాంతాలపై దృష్టి సారించారు. అందులో మురికి వాడలు, సంచార జాతులు, భవన నిర్మాణ కార్మికులు ఉండే ప్రాంతాలను గుర్తించారు. అక్కడ ఉండే చిన్నారులకు చుక్కల మందు వేయడానికి అన్ని చర్యలు చేపట్టారు. అలాగే సంచార జాతులు, వలస మరియు వ్యవసాయ కూలీలు, ఇటుక బట్టీల్లో పని చేసేవారి పిల్లలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు.


1995 నుంచి 'పల్స్ పోలియో' ప్రారంభం

ఈ పల్స్ పోలియో అన్ని దేశాలను కలవర పెట్టిందనే చెప్పవచ్చు. కాగా 1995లో దేశవ్యాప్తంగా పోలియో వల్ల అధికారికంగా 35 వేల మంది బాధపడేవారు. అందులో చాలా మంది చనిపోయారు. దీంతో 'పోలియో'ను తరిమి కొట్టడానికి నాటి నుంచి చుక్కల మందును వేస్తున్నారు. పల్స్ అంటే ఒకేసారి..పోలియో అంటే వైరస్. ఈ వైరస్‌ను పూర్తిగా తుదముట్టించాలంటే అందరికీ ఒకేసారి మందును వేయాలి. కాబట్టే పల్స్‌పోలియో కార్యక్రమం రూపుదిద్దుకుంది. తరువాత పోలియో కేసులు తగ్గుముఖం పడుతూ వచ్చాయి. చివరగా దేశంలో 2011 జనవరి 11న వెస్ట్ బెంగాల్‌లోని హౌరా జిల్లాలో ఒక కేసు నమోదైంది. మన రాష్ట్రానికి సంబంధించి 2008లో పశ్చిమగోదావరి జిల్లాలో ఒక కేసు నమోదు కాగా జిల్లాలో 2003లో కడప నగరం రవీంద్రనగర్‌లో రెండు కేసులు నమోదయ్యాయి.

- ఈ పోలియో 'వైరస్' కారణంగా వస్తుంది. ముఖ్యంగా అప్పుడే పుట్టిన ఐదేళ్లలోపు పిల్లలకు సోకుతుంది. ఉదాహరణకు వైరస్ ఉన్నవారు ఆరుబయట బహిర్భూమికి వెళుతారు. అదే చోటికి మరొకరు వెళ్లి ఆ ప్రాంతంలో చేతులు పెట్టి, ఆ చేతులను నోట్లో పెట్టు కోవడంతో వైరస్ సోకుతుంది. అలాగే వాతావరణం ద్వారా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పోలియో కారణంగా శరీరంలో కాలు, చేయి తదితర అవయవాలు చచ్చుబడిపోతాయి. ఒకవేళ ఊపిరితిత్తులకు సోకితే మరణంకూడా సంభవిస్తుంది. అందుకే శరీరంలోని పోలియో వైరస్‌ను అంతం చేయడానికి రెండు చుక్కల మందును వేయించడం తప్పనిసరి. ముఖ్యంగా ఈ విషయం మరుగుదొడ్ల ప్రాధాన్యతను చెప్పకనే చెబుతోంది.

పల్స్ పోలియో కార్యక్రమం వివరాలు

జిల్లా జనాభా:	22,13,911
ఐదేళ్లలోపు చిన్నారులు:	2,28,131
పల్స్ పోలియో బూత్‌లు:	2,029
మొబైల్ టీమ్స్:	51
చుక్కల మందు వేసే వైద్య సిబ్బంది:	8,467
వ్యాక్సిన్ డోస్‌లు:	3,04,900



▶▶ పొరుగు దేశాలతో పొంచివున్న ముప్పు...

2011 తర్వాత భారతదేశంలో 'పోలియో' కేసులు నమోదు కాలేదు. దీంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఫ్రీ కంట్రీగా ప్రకటించి, సర్టిఫికెట్‌ను ప్రదానం చేసింది. చైనాను కూడా 2000 సంవత్సరంలో ఫ్రీ కంట్రీ దేశంగా ప్రకటించినప్పటికీ 2012-2013లో 24 కేసులు నమోదు కావడం అన్ని దేశాలను ఆందోళన కలిగించింది. పొరుగు దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లో పోలియో కేసుల నమోదు అందరినీ కలవరపాటుకు గురిచేసింది. 2015వ సంవత్సరంలో అక్కడ 53 కేసులు నమోదయ్యాయి. ఆ ప్రభావం చైనా మీద పడినట్లు ఆరోగ్య సంస్థలు భావిస్తున్నాయి. అలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని భారత్‌తో పాటు అన్ని దేశాలు గట్టి చర్యలు చేపడుతున్నాయి.

- సాధారణంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో ఒక ఏడాదికి మొదటి విడత జనవరిలో, రెండో విడత ఫిబ్రవరిలో నిర్వహించేవారు. అయితే మూడేళ్ల నుంచి దేశ వ్యాప్తంగా ఒక డోసు మాత్రమే పిల్లలకు చుక్కల మందు వేస్తున్నారు. 2023 ఏడాదిలో దేశ వ్యాప్తంగా చుక్కల మందును వేయలేదు. తాజాగా ప్రస్తుతం ఈ ఏడాది పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతోంది. ఈ అంశాన్ని తల్లిదండ్రులు, పెద్దలు గమనించి తమ ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా చుక్కల మందును వేయించాలి.

అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం



పల్స్ పోలియో కార్యక్రమం కోసం అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశాం. అర్హులైన పిల్లలకు తప్పనిసరిగా రెండు చుక్కల మందును వేయించాలి. దీనివల్ల పోలియోను నిర్మూలించవచ్చు. ఈ కార్యక్రమం విజయవంతానికి అందరూ సహకరించాలి.
– డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన ఐబీ టీం



ప్రభుత్వ అంధుల పాఠశాలలో ఐబీ టీం

వైవీయూ: ఇంటర్నేషనల్ బాకాలారియట్ ప్రతినిధులు శనివారం కడపలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఐబీ టీం సభ్యులు, ఐబీ కరికులం రూపకల్పన సీనియర్ మేనేజర్ వెండ్రీ గ్రీన్ (అమెరికా వాషింగ్‌టన్ డీసీ), ఐబీ పర్సన్ డెవలప్‌మెంట్ స్పెషలాఫీసర్ ఎరిక్ బాబర్ (ఇంగ్లాండ్), ఎస్‌సీఈఆర్‌టీ ఐబీ కరికులం స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ వై. గిరిబాబు యాదవ్‌ల బృందం కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్, ప్రభుత్వ అంధుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఐబీ ప్రతినిధుల బృందం మెయిన్ స్కూల్‌లో పాఠశాల హెచ్‌ఎం నాగమణి, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పాఠశాల నిర్వహణ, తరగతుల బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం 8, 9 తరగతి విద్యార్థులకు ఐఎఫ్‌పీ ద్వారా నిర్వహిస్తున్న బోధనను పరిశీలించారు. విద్యార్థులతో పాటు వారు కూర్చుని బోధన అభ్యసన ప్రక్రియను పరిశీలించి నోట్ చేసుకున్నారు. అనంతరం సైన్స్‌ల్యాబ్‌లో ప్రదర్శించిన ప్రాజెక్టులను వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను, విద్యార్థులకు ఏ విధంగా నేర్పుతున్నారన్న విషయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. జగనన్న గోరుముద్ద ద్వారా విద్యార్థులకు అందుతున్న నాణ్యమైన భోజనాన్ని పరిశీలించి నమోదు చేసుకున్నారు. ఉపాధ్యాయులు జి.టి. దామోదర్, టి. రవిశంకర్‌రెడ్డి, బి. రమేష్, సత్తార్, వెంకటలక్ష్మి, రెడ్డినాయక్, సీఆర్‌ఎంటీ వెంకటకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అంధుల పాఠశాల పరిశీలన..

కడప శంకరాపురంలోని ప్రభుత్వ అంధుల పాఠశాలను ఐబీ ప్రతినిధుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా అంధుల చదువుకు సంబంధించిన బ్రెయిలీ పలక, బోధన విధానాలను అడిగి తెలుసుకున్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కలెక్టర్ విజయరామరాజు

పులివెందుల రూరల్: పులివెందుల మోడల్‌టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం సాయంత్రం కలెక్టర్ విజయరామరాజు పరిశీలించారు. పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ముందుగా ఉలిమెల్లరోడ్డులోని ఉలిమెల్ల లేక్‌వ్యూ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెలలో పులివెందులలోని మోడల్ టౌన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రారంభిస్తారన్నారు. ఆయన వచ్చేనాటికి పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులు కాంట్రాక్టర్లకు సూచించారు. పాత మార్కెట్‌లోని మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను, మెయిన్ బజార్‌లో నిర్మిస్తున్న బోలే వార్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, సీపీ శంకర్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

▶▶ పురోగతిలో ప్రాధాన్యత పనులు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ప్రాధాన్యత పనులు పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. శనివారం రెవెన్యూ రీ సర్వే, ఇనాం-అసైన్డ్ భూములు, ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్, కరువు మండలాల్లో ఉపాధి, తాగునీరు, ఎంఎస్‌ఎంఈ క్లస్టర్లకు భూమి కేటాయింపు, పల్స్‌పోలియో తదితర అంశాలపై చీఫ్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపు ప్రాధాన్యత పనులు లక్ష్యం మేరకు పూర్తి చేస్తామన్నారు. ఎంఎస్‌ఎంఈల సర్వే ప్రారంభిస్తున్నామన్నారు. ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారిశ్రామిక అవసరాలకు నీటి కొరత ఏర్పకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈనెల 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఎంఎస్‌ఎంఈల సర్వేకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు పక్కాగా అమలు చేయాలి

కడప సెవెన్‌రోడ్స్: రానున్న సాధారణ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్-ఈఎస్‌ఎంఎస్ నిబంధలను పక్కాగా అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని సభా భవన్‌లో అధికారులకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ ప్రస్తుతం జరగనున్న ఎన్నికలను పకడ్బందీగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. సీజర్ మేనేజ్మెంట్ పై అవగాహన పెంచుకుని ఎన్నికల నిర్వహణ నియమావళిని పాటించాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగానే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుందని ప్రభుత్వ అధికారులందరూ ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని ఆదేశించారు. ఎల్‌డీఎం దుర్గాప్రసాద్, డీఐఓ డాక్టర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న కంచి పీఠాధిపతి



ఒంటిమిట్ట రామయ్య సన్నిధిలో కంచి పీఠాధిపతి

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయంలో వెలసిన రఘురామున్ని శనివారం కంచి కామకోటి పీఠం అధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ లాంఛనాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ గావించి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రంగమండపంలో కంచి పీఠాధిపతికి తీర్థప్రసాదాలను అందజేశారు.

అట్టహాసంగా అన్నమయ్య విగ్రహావిష్కరణ

కడప కార్పొరేషన్: కడప నగరంలోని మద్రాసు రోడ్డులో అన్నమాచార్యుల నూతన కాంస్య విగ్రహావిష్కరణ అట్టహాసంగా జరిగింది. 25వ డివిజన్ కార్పొరేటర్ కె. సూర్యనారాయణ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, కడప మేయర్ కె. సురేష్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరై లోడర్ మిషన్ సాయంతో విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ తెలుగు సాహితీ చరిత్రలో తొలి వాగ్గేయకారుడు అన్నమాచార్యులని కొనియాడారు. పద కవితా పితామహుడైన ఆయన వెంకటేశ్వరస్వామిని కీర్తిస్తూ 32వేలకు పైగా కీర్తనలు రచించారని తెలిపారు. ఆయన మన జిల్లాలో జన్మించడం మనందరి అదృష్టమన్నారు. అన్నమయ్య విగ్రహాన్ని ఆవిష్కరించే భాగ్యం తమకు దక్కడం గర్వంగా భావిస్తున్నామన్నారు. కడప నగరంలో అన్ని కూడళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అహ్మద్‌బాషా, పాకా సురేష్, జయచంద్రారెడ్డి, ఎస్. సుబ్బారెడ్డి, డా. శివా నాయక్, శివకేశవ, సీహెచ్ వినోద్, దాసరి శివప్రసాద్, పత్తిరాజేశ్వరి, ఎం. చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మి నారాయణ, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.



అన్నమయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

ప్రొద్దుటూరు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు

ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు పట్టణాభివృద్ధికి జగనన్న ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మైదుకూరు రోడ్డులో రూ.3.68 కోట్లతో నూతనంగా నిర్మించిన డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులను శనివారం సాయంత్రం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితో కలసి ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రభుత్వాలు అభివృద్ధి కోసం జనరల్ ఫండ్, లేదా ఆర్థిక సంఘం ద్వారా మంజూరైన నిధులను మాత్రమే వినియోగించేవారన్నారు. జగనన్న ప్రభుత్వం అభివృద్ధి కోసం రూ.కోట్ల నిధులు ప్రొద్దుటూరుకు మంజూరు చేసిందని తెలిపారు. అందులో భాగంగానే ప్రొద్దుటూరులో గొప్ప స్థాయిలో కూరగాయల మార్కెట్, ఆర్టీసీ బస్టాండ్, పెన్నా హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం తదితర అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు వివరించారు. రూ.150 కోట్లతో అమృత్ నీటి పథకాన్ని పూర్తి చేసి ప్రజలకు శుద్ధి చేసిన నీటిని అందిస్తున్నామన్నారు.



సెంట్రల్‌లైటింగ్ ప్రారంభోత్సవంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రస్తుతం మైదుకూరు రోడ్డు విస్తరణలో భాగంగా స్మార్ట్ స్ట్రీట్ పనుల్లో భాగంగా రోడ్డు విస్తరణ పనులు, డివైడర్ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు చెప్పారు.మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్ చైర్మన్లు పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయిల్ మిల్ ఖాజా, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, రాజారాంరెడ్డి, స్థానిక కౌన్సిలర్లు ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, మహ్మద్ గౌస్, నూకా నాగేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, ఏపీపీఎస్‌సీ మాజీ సభ్యుడు నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి,కోనేటి సునంద, కొవ్వూరు రమేష్ రెడ్డి, మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దగ్ధమైన స్కార్పియో వాహనం



వేముల : మండలంలోని పెర్నపాడు గ్రామం వద్ద శనివారం ప్రమాదవశాత్తు స్కార్పియో వాహనం కాలిపోయింది. ఈ సంఘటనకు సంబంధించి వేంపల్లె మండలం అలవలపాడు గ్రామానికి చెందిన సునీల్‌కుమార్‌రెడ్డి స్కార్పియో వాహనంలో పులివెందులకు బయలుదేరాడు. పెర్నపాడు గ్రామ సమీపానికి రాగానే బ్యాటరీలో పొగలు రావడంతో వాహనాన్ని పక్కకు నిలిపివేశాడు. ఈలోపే మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో సునీల్‌కుమార్‌రెడ్డి అందులో ఉన్న ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ తీసుకుని దిగేలోపు మంటలు వ్యాపించాయి. దీంతో స్కార్పియో వాహనం పూర్తిగా దగ్ధమైంది. వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. వాహనం పూర్తిగా దగ్ధం కావడంతో నష్టం వాటిల్లింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, మహిళాభివృద్ధి మరియు శిశుసంక్షేమశాఖ
జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సంస్థ, కడప

టెండర్ నోటీసు

ఆర్.సి.నెం:159/A2/డి.డబ్ల్యు & సి.డి.ఎ/కడప — తేది:02.03.2024

జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సంస్థ, కడప జిల్లాలోని ICDS Projects 183 Saksham అంగన్వాడి కేంద్రములకు RO Units సరఫరా చేయుటకు సీల్డు టెండర్లు కోరడమైనది. రూ.10,000/- (అక్షరాల పది వేల రూపాయలు) బ్యాంకు డ్రాఫ్ట్ రూపములో ప్రాజెక్ట్ డైరెక్టర్, డి.డబ్ల్యు & సి.డి.ఎ. కడప పేరిట చెల్లించి టెండర్ డాక్యుమెంట్లు 04.03.2024వ తేది నుండి కార్యాలయ పని వేళలో పొందవలెను. ఈ టెండర్ రద్దు చేయుటకు, తేది పొడిగించుటకు సర్వ అధికారము జాయింట్ కలెక్టరు/చైర్మన్, జిల్లా కొనుగోలు కమిటీ, కడప వారికి కలదు. Tender Schedule పొందుటకు ఆఖరు తేది : 12.03.2024, Tender Schedule సమర్పించుటకు ఆఖరు తేది : 12.03.2024 3.00 P.M. వరకు, Tender తెరచు తేది : 13.03.2024 5.30 P.M. కు అని తెలియచేయడమైనది.

సంయుక్త కలెక్టరు మరియు చైర్మన్ వారి తరఫున, జిల్లా కొనుగోలు కమిటీ, కడప — Dist.Women & Child Welfare & Empowerment Officer, YSR District, Kadapa

MUNICIPAL CORPORATION KADAPA

"ap"e-procurement Short Tender Notice.
"ap"e-procurement Tender Notice.
5398/ATO/MCK dt: 13.02.2024

S.No.	Description	No. of Works	ECV. Rs. in lakhs
01	Redevelopment and improving the Skilling in ameen ITI in Kadapa, YSR District	01	60.00
02	Providing Pending Developmental works i.e Electrification. Painting. Ceiling. flooring and Plumbing etc. in Ambedkar Bhavan at RIMS in Kadapa, YSR District.	01	81.15
03	General Funds	26	34.07
04	GGMP	24	368.25
05	MPLADS	08	25.46
06	CMDF	02	16.21
07	SWM	07	30.92
	Total	69	616.06

69	Bid Document Download Start Date	Bid Document Download End Date	Bid Submission Closing Date & Time
34	02.03.2024@10.30 PM	07.03.2024@03.00 PM	07.03.2024@03.00 PM
35	04.03.2024@03.00 PM	11.03.2024@03.00 PM	11.03.2024@03.30 PM

Further details can be seen at 'e' Procurement market place in www.apeprocurement.gov.in officer inviting bid, Commissioner, Municipal Corporation of Kadapa, A.P.

వలంటీర్లపై టీడీపీ, జనసేనకు ఎందుకంత కక్ష

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు : వలంటీర్ల వ్యవస్థపై టీడీపీ, జనసేన పార్టీలకు ఎందుకు అంత కక్ష అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రశ్నించారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు కౌన్సిలర్ ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితోపాటు ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి పార్టీ కార్యకర్తలతో కలసి ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా రాచమల్లు శివప్రసాదరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వలంటీర్లు ఇంటింటికి చేరవేస్తున్నారన్నారు. అలాంటి వలంటీర్లను తొలగిస్తామని చంద్రబాబు ఓ వైపు చెబితే, మరో వైపు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇళ్లలోని మహిళలకు సంబంధించిన రహస్య సమాచారాన్ని ఇతర దేశాలకు చేరవేస్తున్నారని విమర్శించారన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులైన వలంటీర్లను ఇష్టమొచ్చినట్లు విమర్శించడం తగదన్నారు.

టీడీపీ ఇన్‌చార్జి మాటలను వెనక్కి తీసుకోవాలి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్ కుమార్‌రెడ్డి వలంటీర్లను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఎమ్మెల్యే రాచమల్లు డిమాండ్ చేశారు. వలంటీర్లను బట్టలు ఊడదీసి కొడతానని విమర్శించడం తగునా అని ప్రశ్నించారు. వలంటీర్లలో ఎక్కువ శాతం మంది మహిళలు ఉన్నారని తెలిపారు. ఏం చేశారని వలంటీర్లను కొడతారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, టౌన్ బ్యాంకు చైర్మన్ యెల్లాల కుమార్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శివకుమార్ యాదవ్, శివారెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, మాజీ వైస్ ఎంపీపీ మల్లెల రాజారాంరెడ్డి, సోములవారిపల్లె సర్పంచ్ మోపూరి ప్రశాంతి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజా, రాచమల్లు రాఘవేంద్రారెడ్డి, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, జయరామిరెడ్డి, శివరామిరెడ్డి, ముదిరెడ్డి నాగరత్న, సాయికుమార్‌రెడ్డి, చవ్వా దేవి, ఎం.భాగ్యమ్మ, కె.భవిత, మాజీ జెడ్పీటీసీ విజయభాస్కర్‌రెడ్డి, తాళ్లమాపురం ఉపసర్పంచ్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


అదుపు తప్పి మద్యం లారీ బోల్తా

సిద్దవటం : సిద్దవటం గ్రామ శివారులోని మద్యం దుకాణం సమీపంలో అదుపు తప్పి మద్యం లారీ బోల్తా పడింది. లారీ డ్రైవర్ శ్రీనివాసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సింగరాయకొండ నుంచి ఏసీ బ్లాక్ మద్యం లారీలో కడపకు రవాణా చేస్తుండగా సిద్దవటం గ్రామ శివారులోని ప్రభుత్వ మద్యం దుకాణం సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి మద్యం లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఈ విషయాన్ని వెంటనే అధికారులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలాన్ని కడప ఎక్సైజ్ శాఖ అధికారులు పరిశీలించారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామానికి చెందిన చీలి సుబ్బరాయుడు అనే వ్యక్తి వద్ద నుంచి 10 క్వార్టర్ బాటిళ్లు, 12 బీరు బాటిళ్లను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పి.తులసీ నాగప్రసాద్ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని పేర్కొన్నారు.

జేఎన్టీయూలో పాము కలకలం



వసతి గృహంలో ఉన్న పాము

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలోని మహిళల వసతి గృహంలో పాము కనిపించడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. విద్యార్థులు నిద్రిస్తున్న గదుల్లోకి విషపురుగులు రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వసతి గృహాల్లోకి విషపురుగులు రాకుండా చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

చదువుతో పాటు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి

కడప ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో అధికారులు

వైవీయూ : విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని కడప ఉప విద్యాశాఖాధికారి డి. రాజగోపాల్‌రెడ్డి సూచించారు. శనివారం కడప నగరంలోని చెమ్ముమియాపేట బాలికల ఉన్నత పాఠశాలలో ఎంటర్ ప్రెన్యూరియల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ జిల్లాస్థాయి ప్రాజెక్టుల ఎక్స్‌పో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిప్యూటీ ఈఓ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాలు ఆశించే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగే విధంగా తమ మనస్తత్వాన్ని మార్చుకోవాలని సూచించారు. మన చుట్టూ ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని వ్యాపారాత్మక దృక్పథంతో సమాజ సేవ చేసే విధంగా రాణించాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి బి. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 164 మంది విద్యార్థులు రూపొందించిన 164 ప్రాజెక్టులను ఈ ఎక్స్‌పోలో ప్రదర్శించామన్నారు. ఇందులో ఉత్తమమైన రెండింటిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈనెల 6వ తేదీన రాష్ట్రస్థాయి ఎక్స్‌పో విజయవాడలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె ఎంఈఓ వి. వెంకట్రామిరెడ్డి, సమగ్రశిక్షా అభియాన్ సెక్టోరియల్ అధికారులు ధనలక్ష్మి, విశ్వనాథరెడ్డి, రామాంజనేయరెడ్డి, కేశవరెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ బయపురెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ప్రాజెక్టులు

1. విద్యార్థి	: ఇలియాస్, జెడ్పీహెచ్‌ఎస్, నల్లపురెడ్డిపల్లి
గైడ్ టీచర్	: బి. మహేశ్వర్‌రెడ్డి
అంశం	: స్మార్ట్ ఫ్లోరింగ్ క్లీనింగ్
2. విద్యార్థులు	: జి.హర్షిత, గాయత్రి, త్రివేణి, ఎంజేపీఏపీబీసీడబ్ల్యుఆర్, వనిపెంట
గైడ్ టీచర్	: నసీరున్నీసా బేగం
అంశం	: ధూప్ స్టిక్స్



ఎంతో మేలు చేశారు



నేను ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నా. నాకు ముగ్గురు పిల్లలు. పెద్ద కుమార్తె అఫ్రా అంజుమ్ ఇంటర్మీడియట్ చదువుతోంది. రెండవ పాప ఆయిషా అంజుమ్ 9వ తరగతి, బాబు మహమ్మద్‌ఖైఫ్ మూడవ తరగతి చదువుతున్నాడు. పిల్లలను చదివించాలంటే భారంగా ఉండేది. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అయ్యాక మా రెండో పాప ఆయిషా అంజుమ్‌కు అమ్మ ఒడి కింద ఏటా రూ.15 వేలు వస్తోంది. దీంతో పిల్లల చదువు సాఫీగా జరుగుతోంది. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎంతో మేలు చేశారు. – బాబ్‌జాన్, ఆటో డ్రైవర్, గౌసియావీధి, మదనపల్లె.

ఒక్క రోజులోనే ధ్రువపత్రాలు అందాయి



పీలేరు రూరల్ : గతంలో మా పిల్లలకు అవసరమైన ధ్రువపత్రాలు పొందాలంటే మీ సేవలో దరఖాస్తు చేసుకుని తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయినా పిల్లలకు సకాలంలో సర్టిఫికెట్లు అందేవికావు. అయితే జగనన్న సురక్ష పథకంలో గ్రామ వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకోగా ఒక రోజులోనే ధ్రువపత్రాలు ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చారు. ప్రభుత్వ సేవలు ఇంత సులభంగా అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉండాలి.
– కస్తూరి, బోదుమల్లువారిపల్లె, పీలేరు మండలం

సొంతింటిని నిర్మించుకున్నా



జగనన్న ప్రభుత్వం వచ్చాక నేను సొంతింటిని నిర్మించుకున్నాను. ఇప్పటి వరకు సొంతిల్లు లేకపోవడంతో అమ్మగారింట్లోనే తలదాచుకునేదానిని. గత కొన్నేళ్లుగా ఇల్లు కావాలని అర్జీలు పెట్టుకున్నాను. కానీ ఇల్లు మంజూరు కాలేదు. జగనన్న ప్రభుత్వం రాగానే ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాను. నాకు జగనన్న కాలనీలో స్థలంతో పాటు ఇల్లు మంజూరు కావడంతో ఇంటిని నిర్మించుకున్నాను. చాలా సంతోషంగా ఉంది. జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాను.
– చందనాల జయలక్షుమ్మ, బ్రాహ్మణపల్లె, గోపవరం మండలం

ఉత్సవాల ఏర్పాట్లు పక్కాగా చేపట్టండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ షరీఫ్

పెండ్లిమర్రి : పొలతల శైవ క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు సంబంధించి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని కడప ఆర్డీఓ మధుసూదన్, డీఎస్పీ షరీఫ్‌లు పేర్కొన్నారు. పొలతల క్షేత్రంలోని పర్యాటక భవనంలో శనివారం ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పార్కింగ్ స్థలాన్ని పెంచి వచ్చిన వాహనాలను క్రమ పద్ధతిలో పార్కింగ్ చేయించాలన్నారు. అలాగే ఘాట్‌ల వద్ద బారికేడ్‌లు ఏర్పాటు చేయించాలన్నారు. ముఖ్యంగా తాగు నీటికి ఇబ్బందులు రాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా గుంతలు పూడ్చి వేయాలన్నారు. అత్యవసర సేవలకు 108 అంబులెన్స్ వాహనాలు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సీఐ నాగరాజు, ఆలయ చైర్మన్ నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనివాసులు, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్టీసీ అధికారులు, అటవీ అధికారులు, ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అత్యుత్తమ కట్టడాలకు పటిష్టమైనది భారతి సిమెంట్

బ్రహ్మంగారిమఠం : అత్యుత్తమ కట్టడాలకు పటిష్టమైన సిమెంట్ భారతి సిమెంట్ అని ఆ కంపెనీ జిల్లా టెక్నికల్ ఇంజినీర్ కె . నాగేంద్ర తెలిపారు. శనివారం బ్రహ్మంగారిమఠంలో తాపీ మేస్త్రీలకు సిమెంట్ నాణ్యత, వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే 20 మంది మేస్త్రీలకు రూ 1లక్ష ఉచిత ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సిమెంట్ రోబోటిక్, జర్మనీ టెక్నాలజీతో తయారవుతుందన్నారు. భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ మరింత నాణ్యత కల్గి ఉంటుందన్నారు. ఈ సిమెంట్ పర్యావరణానికి అనుకూలంగా ఉంటుందన్నారు. ఇతర రకం సిమెంట్ 5 గంటల్లో సెట్ అయితే భారతి అల్ట్రా ఫాస్ట్ 2 గంటలలోనే సెట్ అవుతుందన్నారు. ఒక వేళ వర్షం పడే సూచనలున్నా ఈ సిమెంట్ వినియోగించవచ్చన్నారు. ఈ కార్యకరమంలో సేల్స్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, స్థానిక డీలర్ భూమిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

తల్లి మరణంతో అనాథ అయిన బాలిక



తల్లి మానసతో హారిక (ఫైల్‌ఫొటో)

బి.కోడూరు : తల్లి వింతవ్యాధితో మరణించడంతో పాటు తండ్రి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో బాలిక అనాథగా మిగిలిపోయింది. వివరాల్లోకి వెళితే మండలంలోని పాయలకుంట్ల గ్రామానికి చెందిన కొమరాజుగురప్పడు, మానసలకు పది సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి వివాహమైన మూడు సంవత్సరాలకు హారిక అనే కుమార్తె జన్మించింది. మానసకు సోరియాసిస్ వ్యాధి వ్యాపించడంతో ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆమెకు గుర్రప్పడు సరిగా వైద్యం అందించకపోవడంతో వ్యాధి తీవ్రమైంది. రోజురోజుకు ఆరోగ్యం క్షీణించడంతో ఆమె భర్త రెండు సంవత్సరాల క్రితం వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఇంటి నుండి వెళ్లిపోయాడు. అప్పటి నుండి హారిక ఆలనాపాలన తల్లి మానసతో పాటు తోటి బంధువులు చూసుకునేవారు. మానస ఆరోగ్యంగా రోజురోజుకు క్షీణించి చివరకు శుక్రవారం ఆమె మృతి చెందింది. దీంతో హారిక ఆలనాపాలన చూసే వారు లేకపోవడంతో ఆ బాలిక అనాథగా మిగిలింది. బాలిక దయనీయ పరిస్థితిని చూసిన గ్రామస్తులు కన్నీటిపర్యంతమవుతున్నారు. అనాథగా మిగిలిన హారికను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గోడ కూలి వ్యక్తి మృతి



సుదర్శన్ మృతదేహం

కడప అర్బన్ : కడప నగరంలోని రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సాగర్‌కాలనీలో గోడకూలి కొమ్మినేని సుదర్శన్ (36) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఏఎస్‌ఐ యోగా రాయల్ తెలిపారు. సుదర్శన్ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అతని సంబంధించి పాత ఇంటి గోడ ఉంది. జేసీబీతో ఆ ఇంటిని తొలగిస్తుండగా ఒక్కసారిగా గోడ సుదర్శన్‌పై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

సీమ అభివృద్ధికి కృషి

కమలాపురం : రాయలసీమ అభివృద్ధికి కృషి చేస్తానని రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం ఆయన కమలాపురంలో విలేకరులతో మాట్లాడుతూ త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కడప పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు చెప్పారు. తమ పార్టీ తరఫున సలహాదారునిగా ప్రముఖ రచయిత ఖలందర్‌ను నియమించామన్నారు.

అరటిపంట దగ్ధం



కాశినాయన : మండలంలోని శివరామపాలగిరి గ్రామంలో కౌలురైతు సూరికి చెందిన నాలుగు ఎకరాల అరటిపంట శనివారం దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు 11 కేవీ విద్యుత్ వైర్లు తెగిపోవడంతో మంటలు చెలరేగి నిప్పంటుకున్నట్లు స్థానికులు తెలిపారు. పోరుమామిళ్ల ఫైర్‌స్టేషన్ సిబ్బంది మంటలను అదుపుచేశారు. నాలుగు ఎకరాల్లోని అరటిపంట, డ్రిప్‌వైర్లు పూర్తిగా కాలిపోయి రూ.10 లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు..

వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్‌గా ఇస్మాయిల్

- మైనార్టీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీగా ఇర్ఫాన్
- పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి
- నియామక పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి



మైనార్టీ సెల్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

కమలాపురం : పార్టీకి మీరు చేసిన సేవలను గుర్తించి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మీకు పదవులు కేటాయించారని, ఆ పదవులకు మీరు వన్నె తీసుకురావాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి పదవులు పొందిన నేతలకు నియామక పత్రాలు అందజేశారు. కమలాపురం పట్టణానికి చెందిన షేక్ ఇస్మాయిల్ (దర్గా-ఈ-గఫారియా)ను వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా, మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీటీసీ ఇర్ఫాన్‌ను మైనార్టీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీగా, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నిమ్మకాయల సుధాకర్ రెడ్డిని పార్టీ కేంద్ర కమిటీ నియమించి జారీ చేసిన నియామక పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి కమలాపురం నియోజకవర్గ నాయకులు చేసిన సేవలను గుర్తించి పదవులు కట్టబెట్టిందన్నారు. భవిష్యత్తులో మీరు మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. మైనార్టీ సెల్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డికి శాలువ కప్పి, పూలమాలతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, హిదాయత్, చెన్నకేశవరెడ్డి, ఉరుటూరు సురేష్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, జావీద్, ఖాద్రి, గఫార్, బాండ్, సుబ్బన్న, రబ్బాని, నూర్, భీమా తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి వీక్లీ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు



'వీక్లీ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు' ప్రశంసాపత్రాలు అందుకున్న పోలీసులతో జిల్లా ఎస్పీ

కడప అర్బన్ : పోలీస్ సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి 'వీక్లీ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు'ను అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ముగ్గురు సివిల్, ఇద్దరు ఎస్‌ఈబీ, ఒక ఏఆర్ సిబ్బందిని ఎంపిక చేసి నగదు రివార్డు, ప్రశంసాపత్రం అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

- బ్రహ్మంగారిమఠం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన హత్య కేసులో పరారీలో ఉన్న నిందితుడిని ఎంతో చాకచక్యంగా అరెస్ట్ చేయడంలో కీలకపాత్ర పోషించిన సి. శ్రీనివాసులు (పి.సి 1186), ఈ. ఓబులయ్య (పి.సి. 2769)లను జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ప్రత్యేకంగా అభినందించారు.
- ఎన్నికల నేపథ్యంలో తాళ్లప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని సుగుమంచిపల్లి చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీల్లో నలుగురు వ్యక్తులు ఎలాంటి బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రూ. 35 లక్షలు నగదు స్వాధీనం చేసుకోవడంలో కీలకపాత్ర పోషించిన కానిస్టేబుల్ బి.వి.శివనాగిరెడ్డి (పి.సి. 2294)ని జిల్లా ఎస్పీ ప్రశంసించారు.
- పోలీసు సిబ్బందికి నిర్వహిస్తున్న యాంటీ-రయట్ డ్రిల్‌ను సిబ్బందికి తర్ఫీదు ఇవ్వడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఏ.ఆర్. కానిస్టేబుల్ జి.వి సుబ్బయ్య (ఏ.ఆర్. పి.సి 3207)ను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.
- ఇటీవల కారులో, స్కూటీలో అక్రమంగా తరలిస్తున్న 120 ఫుల్ బాటిళ్ల గోవా రాష్ట్రానికి చెందిన మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ హెడ్ కానిస్టేబుల్ కె. రమణయ్య, టి. వెంకటరెడ్డి కీలకపాత్ర పోషించారు. వీరిని ఎస్పీ అభినందించారు. 'వీక్లీ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు' అందుకున్న సిబ్బంది మున్ముందు ఇదే స్ఫూర్తితో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.

పశువుల మేత దగ్ధం

సింహాద్రిపురం : మండలంలోని కోవరంగుట్ట పల్లె గ్రామంలో శనివారం మధ్యాహ్నం పశువులకు సంబంధించిన గడ్డి దగ్ధమైంది. బాధిత రైతు కిషోర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మైదుకూరు నియోజకవర్గం నుంచి 5 ట్రాక్టర్లలో రూ.35వేలతో పశువుల మేతను కొనుగోలు చేశారు. దీన్ని తన కలంలో వాము వేసి భద్రపరిచారు. మధ్యాహ్నం సమయంలో వాములో నుంచి పొగలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి కేకలు వేశారు. ప్రజలందరు గుమికూడి మంటలను అదుపుచేశారు. మంటలు ప్రమాదవశాత్తు వచ్చాయా? లేక ఎవరైనా ఆకతాయిలు నిప్పు రవ్వ వేశారా? తెలియడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.